జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- ప్రభుత్వ పథకాలు పేదలకు వరం
- పంటల బీమా నమోదులో రాష్ట్రంలోనే అగ్ర స్థానం
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్
- జాతీయ జెండా ఆవిష్కరణ

జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు వరమని చెప్పారు. వందశాతం అర్హులకు పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. 2024-25 రబీ సీజన్‌లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద 1,27,558 హెక్టార్లకు సంబంధించిన రైతులతో రూ.13.29 కోట్లతో పంటల బీమా నమోదు చేయించి రాష్ట్రంలోనే అగ్ర స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. 2024, డిసెంబర్ వరకు వ్యవసాయ రంగం కింద రూ.8,353 కోట్ల పంట రుణాల లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.10,995 కోట్లు మంజూరు చేసి 132శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎ-గ్రేడ్ వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. రైతుల సమగ్ర అభివృద్ధికి పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తూ వారి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పాటునిస్తుందని చెప్పారు. చంద్రన్న సంచార పశు వైద్య సేవ పథకం ద్వారా జిల్లాలో 13 సంచార అంబులెన్స్‌ల ద్వారా 69,221 పశువులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కానుక పథకం ద్వారా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని పెంచుతూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు సిఎం చంద్రబాబు నాయుడు అండగా ఉన్నారని తెలిపారు. మహిళా సాధికారతలో భాగంగా 2025 జనవరి నాటికి 18,355 స్వయం సహాయ సంఘాలకు రూ.858.21 కోట్ల రుణ పంపిణీ లక్ష్యం కాగా 7,016 స్వయం సహాయక సంఘాలకు రూ.594.35 కోట్లు పంపిణీ చేశామని చెప్పారు. జిల్లాలో 2,389 అంగన్వాడీ కేంద్రాల్లో 80,428 మంది గర్భిణులకు , బాలింతలు, చిన్నారులకు మెరుగైన పోషక విలువలతో కూడిన బాల సంజీవని కిట్స్‌ను ప్రతి నెలా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు నిర్దేశించిన 80 లక్షల పని దినాలకు గాను 65.50 లక్షల పని దినాలు కల్పించి 81.88 శాతం పురోగతిని సాధించామని పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా జిల్లాలోని 2007 పాఠశాలల్లో 1,28,186 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం ద్వారా వైద్య ఖర్చు రూ.5 లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచామని చెప్పారు. జిల్లాలో రూ.17వేల కోట్ల పెట్టుబడితో 28 భారీ పరిశ్రమలు స్థాపించి 16,208 మందికి ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రూ.3,295.22 కోట్లతో 39,937 స్థాపించామని తెలిపారు. 2,01,172 మందికి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం 39 పారిశ్రామిక వాడలను స్థాపించామన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల పరిశ్రమలకు 3,293 ఎకరాల భూమిని వివిధ రకాల పరిశ్రమలకు కేటాయించామని పేర్కొన్నారు. ఉచిత నూతన ఇసుక విధానం జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 11 ఇసుక రీచులలో 8,20,319 మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగ దారులకు ఉచితంగా సరఫరా చేశామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా 2024, జూన్ 15 నుంచి ఇప్పటి వరకు 10,495 ఫిర్యాదులు అందగా ఇందులో 7,914 ఫిర్యాదులను పరిష్కరించామని చెప్పారు. జిల్లాలో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు, జడ్‌పి చైర్మన్, మేయర్, జెసి, జిల్లా అధికారులకు, ప్రభుత్వ శాఖల సిబ్బందికి అభినందనలు తెలిపారు.

విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర వేడుకలలో భాగంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పేక్షకులను ఎంతగానో అలరించాయి. మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ కడప వారు 'చెక్ దే ఇండియా', హ్యాపీ కిడ్స్ స్కూల్ వారు 'ఇది మన దేశం రా', ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ విద్యార్థులు 'బంజారా సాంగ్' జడ్ హైస్కూల్ శెట్టివారిపల్లి, మైదుకూరు విద్యార్థులు 'ఐ లవ్ ఇండియా', విస్డం హైస్కూల్ విద్యార్థులు గుర్రపు స్వారీ విన్యాసం చేశారు. అగ్నిమాపక శాఖ వారు చేసిన ప్రదర్శనలు ప్రేక్షకులను అబ్బుర పరిచాయి. ప్రజలను డాగ్ షో ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోలీస్‌శాఖలోని క్లూస్‌టీంలో అత్యంత కీలక పాత్ర పోషించే డాగ్స్ జిల్లాకు సేవలందించడం రక్షణ శాఖకే గర్వకారంగా చెప్పవచ్చు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాన్ని సన్మానిస్తున్న కలెక్టర్

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన సత్కారం..చెన్నూరు, సి.కె.దిన్నె, పులివెందుల, సింహాద్రిపురం, లింగాల, ఎర్రగుంట్ల మండలాల్లో ఉండే స్వాతంత్ర సమర యోధుల వారసులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. **ఎగ్జిబిషన్ స్టాల్స్..** పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలపై ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పా టు చేశారు. వ్యవసాయ, డిఆర్ డిఎ, మెప్మా, డి డబ్ల్యూఎంఎ, ఐసిడిఎస్, ఉద్యాన, మున్సిపల్, పశుసంవర్ధక, ఆప్కో, చేనేత జౌళి, పట్టుపరిశ్రమ, నాబార్డ్,వైద్య ఆరోగ్య, విభిన్న ప్రతి భావంతుల, పోలీస్ శాఖ వారు స్టాల్స్ ఏర్పాటు చేశారు.

కలెక్టర్‌కు సెల్యూట్ చేస్తున్న శునకం

స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆకట్టుకున్న పంచాయతీరాజ్‌శాఖ శకటం

విన్యాసం చేస్తున్న శునకం

నిరసన తెలియజేస్తున్న వామపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు

నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- మద్దతు ధరల చట్టం తేవాలి
- అంబేద్కర్ సర్కిల్లో వామపక్ష కార్మిక, రైతు సంఘాల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు రైతు మెడకు ఉరితాడులా వ్యవసాయ సాంకేతిక చట్టం, సహకార చట్టం వంటివి కేంద్రం నూతన చట్టాలు, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నదని వామపక్ష కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. ఆదివారం కడప అంబేద్కర్ సర్కిల్‌లో వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు బి.మనోహర్, దస్తగిరి రెడ్డి, బాదుల్లా, అన్వేష్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలివేసిందని విమర్శించారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాలలోని విధానాలతోనే తిరిగి కొత్త చట్టాలను తీసుకు వస్తోందని ఆందోళనవ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం కిందకు తెచ్చేందుకేనని విమర్శించారు. సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు, పాల సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలు మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీల గొడుగు కిందకు చేర్చడమే లక్ష్యంగా ఉన్నాయన్నారు. సహకార వ్యవస్థన్నీ కార్పొరేట్ కంపెనీల హస్తగతం అవుతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా జారీచేసిన వ్యవసాయ మార్కెట్ జాతీయ విధాన చట్టం ప్రకారం మొత్తం విధానాలను వ్యవసాయాధారిత పరిశ్రమాధిపతులు, ఎగుమతి దిగుమతి దారులు, విదేశీ వ్యాపారులు రైతుల పంటలను స్వేచ్ఛగా కొనుగోలు చేయడం, నిల్వ చేసుకోవడం, ఎగుమతి చేసుకోవడానికి అనుకూలంగా మార్పులు చేసిందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల విధానమే ఇంక ఉండదన్నారు. వ్యాపారులు ఇష్టారాజ్యం అవుతుందని చెప్పారు. ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకునేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీములు ఇకపై ఉండవన్నారు. ప్రభుత్వాల కొనుగోళ్లు ఉండవని, ఆహార భద్రత చట్టానికి తావు లేదన్నారు. ఇప్పటికే కేంద్రం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తోందని, విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి నాలుగు లేబర్ కోడ్ల అమలుకు పూనుకుందని చెప్పారు. రైతాంగం జరుపుతున్న పోరాటాలకు తలొగ్గి చర్చలు జరపడానికి కేంద్రం అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ చర్చలలో ప్రస్తుతం తెస్తున్న చట్టాలు రద్దు చేసి రైతులు కోరుతున్న సి2+50 ప్రకారం మద్దతు ధరలు గ్యారంటీ చట్టం, రైతులు, వ్యవసాయ కార్మికుల రుణ విముక్తి చట్టం తేవాలన్నారు. ఆహార భద్రత చట్టం కొనసాగింపు, ఉపాధి హామీ పథకం విస్తరణ, కౌలు రైతులకు రక్షణ సాధించడంతోపాటు కార్మికులకు నష్టకరమైన నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయించడం వంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎఐఎఫ్‌టియు నాయకుడు సుబ్బారెడ్డి,సిఐటియు నాయకులు నారాయణరెడ్డి, రాజమణి, పవన్, దస్తగిరి, రవి, ఏఐటియుసి నగర అధ్యక్షులు సుబ్బరాయుడు, కార్యదర్శి మద్దిలేటి, నాయకులు లింగన్న, మల్లికార్జున, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ రెడ్డి, నాయకులు శివశంకర్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, గుజ్జుల లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసయ్య, సురేష్, రమణ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - కడప : పార్టీ బలవపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పిలుపునిచ్చారు. కడప నగరంలోని వైసిపి కార్యాలయంలో నూతన కడప నగర అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారిని ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబుతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మహిళ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు

జిల్లాలో ఆయా శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ ప్రశంసా పత్రాలతో సన్మానించారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప :కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఆంధ్ర, పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న కల్నల్ సి.కె.నాయుడు ట్రోఫీ అండర్-23 మల్టీ డే క్రికెట్ మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 211 పరుగులు చేసింది. రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ జట్టు ఆంధ్ర జట్టు బౌలర్లు విజృంభించడంతో మొదటి ఇన్నింగ్స్ లో 45.1 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సలీల్ ఆరోరా 29, క్రిష్ బగట్ 21 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని సాకేత్ రామ్ 4, కె.ఎస్. రాజు 4 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 27.0 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎస్.డి.ఎన్.వి. ప్రసాద్ 36 (నాటౌట్), ఎస్. వెంకట రాహుల్ 21 పరుగులు చేశారు. పంజాబ్ జట్టులోని ఆయుష్ గోయల్ 4, క్రిష్ బగట్ 2 వికెట్లు తీసుకున్నారు.

న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్ విజేత విజయప్రసాద్ జట్టు

ప్రజాశక్తి-కడప : కడప బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ నంద్యాల చిన్నయ్య ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా న్యాయవాదులకు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో విజేతగా విజయ ప్రసాద్ జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో సాయి వంశీకృష్ణ, విజయ ప్రసాద్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన సాయి వంశీకృష్ణ జట్టు నిర్ణీత 15.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. ఆ జట్టులోని సత్తి వేలు 68 పరుగులు చేశాడు. విజయ ప్రసాద్ జట్టులోని కృష్ణ కేలి 3, సాయిరాం 1 వికెట్ తీసుకున్నారు. అనంతరం 135 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన విజయప్రసాద్ జట్టు 12.0 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 135 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో గెలుపొంది టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఆ జట్టులోని తాజుద్దీన్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 80 పరుగులు చేశాడు. కృష్ణ కేలి 33 పరుగులు చేశాడు. విన్నర్స్ అండ్ రన్నర్స్‌కి ట్రోఫీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు బహుకరించారు. కార్యక్రమంలో టీం విజేత కెప్టెన్ సురేంద్ర రావుకు వారు ట్రోఫీని అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, .సీనియర్ న్యాయవాదులు పి. జయ రామిరెడ్డి, కే. నిరంజన్ కుమార్, జీ. రామలింగారెడ్డి, కే. వెంకటేశ్వర్ రెడ్డి. రెడ్డయ్య, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఎన్. చిన్నయ్య, ఉపాధ్యక్షులు పి. చంద్రమోహన్, కే. నాగ భూషణం, ఎంవి. సుబ్బరామయ్య, జూనియర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - కడప : రాజ్యాంగ పరిరక్షణ కోసం అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి కో- ఆర్డినేటర్ ఎస్.ఏ.సత్తార్ అధ్యక్షతన ఆదివారం కడపలోని పాత కలెక్టరేట్ వద్ద 'రాజ్యాంగమా? మనుధర్మమా' అనే అంశంపై చర్చ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఏ. సత్తార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్ ,బండి జకరయ్య, నాసిర్,మైనుద్దీన్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, టిడిపి యువ నాయకులు సుబ్బరాయుడు, వెనుకబడిన ప్రాంతాల ఐక్యవేదిక నాయకులునారాయణరెడ్డి, హేతువాద సంఘం సి ఆర్ వి ప్రసాద్, బిఎస్‌పి గురప్ప మాట్లాడుతూ భిన్న ప్రాంతాలు భిన్న మతాలు, భిన్నజాతులు ,భిన్న సంస్కృతులు ,వివిధ కులాలు కలగలిసింది భారతదేశం అన్నారు. ఐదు వేల సంవత్సరాలు అలచివేయబడ్డ వర్గాల హక్కుల కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సారథ్యంలో అందరి ప్రయోజనాలు కాపాడే విధంగా రాజ్యాంగం తయారైందన్నారు.

'ఉక్కు' కోసం ఉద్యమించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బద్వేలు : ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవశ్యకత ప్రస్తుత తరుణంలో యువతపై ఉందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పేర్కొన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో జాతీయ పతాకాన్ని మాదన విజయ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ నిర్వహించిన వర్క్ షాప్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న హామీలలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉన్నప్పటికీ పాలకులు ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారని, ఈ జిల్లాలో ఉన్నటువంటి నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక ఇతర దేశాలకు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. ఈ జిల్లాలో ఉక్కు పరిశ్రమ వచ్చేంతవరకు డివైఎఫ్ఐ యువజన సంఘం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. బ్యాంకింగ్, రైల్వే, విమానాశ్రయం, ఎల్ఐసి, బిఎస ఎన్ఎల్, విశాఖ ఉక్కు లాంటి ప్రభుత్వ సంస్థలన్నీటిని ప్రయివేటుపరం చేయాలని చూస్తున్నారని, చట్టాలను సైతం కేంద్రం ప్రభుత్వం ఇష్టానుసారంగా మార్చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్ మహిళ కన్వీనర్ గురుదేవి, కో - కన్వీనర్లు ఫాతిమా, నాగేశ్వరి, నాగ రత్తమ్మ, అరుణ, స్వీటీ, నారాయణమ్మ షబానా, కృష్ణవేణి, డివైఎఫ్ఐ నాయకులు బాల గురయ్య, యువరాజ్, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు

ఘనంగా మేడా మల్లికార్జునరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : మండల పరిధిలోని ఒంటిమిట్ట కోదండ రామాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జన్మదిన వేడుకలను సాలాబాద్ బుజ్జయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురికి పంచారు. ఈ సందర్భంగా బుజ్జయ్య మీడియాతో మాట్లాడుతూ మేడా మల్లికార్జునరెడ్డి ప్రజల మనిషిని అని, చాలా సౌమ్యుడు, ప్రజా నాయకుడని అన్నారు. ఆయనకు పదవి లేనప్పటికీని పరిచర్యలో విష యాల్లో ఇప్పటికీ అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి ఉంటూ వారికి అండగా నిలు స్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతకు ఉపాధిని చూపిం చడంలో ముం టారని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మాజీ స్కూల్ చైర్మన్ అజ్మత్ బాష, కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి , అజంతుల మల్లికార్జున్ రెడ్డి, ఖాదర్ బాషా, కృష్ణారెడ్డి, పెద్ద సంఖ్యలో యువత, కార్యకర్తలు పాల్గొన్నారు

కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు బుజ్జయ్య, కార్యకర్తలు

పర్యాటకానికి పెద్దపీట

- రూ.77.9 కోట్లతో పర్యాటకాభివృద్ధి
- గండికోటను ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- జిల్లా పర్యాటక శాఖ అథారిటీ అధికారి ఎ.సురేష్‌కుమార్ వెల్లడి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేస్తాం. ఇందులోభాగంగా గండికోటను ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంపై దృష్టి సారించాం. ఇందుకు అనుగుణంగా రూ.77.9 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పిస్తాం. గండికోటలో బోటింగ్, సీప్లేన్, హెలీటూరిజం వంటి ఆధునిక హంగులను కల్పించడం జరుగుతోంది. జిల్లాలోని హరితా హోటళ్లలో సదుపాయాలు, పర్యాటకులకు వసతుల కల్పన కొనసాగుతోంది. జిల్లాలోని 36 ఆర్కియాలజీ పరిధిలోని దేవాలయాల గుర్తింపు పనిలో నిమగ్నమయ్యామని పేర్కొంటున్న జిల్లా టూరిజం అథారిటీ అధికారి సురేష్‌తో ముఖాముఖి...

శశి స్కీమ్ కింద ఎంపికైన పర్యాటక ప్రాంతాలను వివరించండి

శశి స్కీమ్ కింద రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన గండికోట, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన అఖండగోదావరి పర్యాటక ప్రాంతాలు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇందులో జిల్లాకు చెందిన గండికోట పర్యాటక ప్రాజెక్టు అభివృద్ధికి రూ.77.9 కోట్లతో అభివృద్ధి పరచాల్సి ఉంది. పి-4 కింద జిల్లా లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి పరిచే ఆలోచనలు ఉన్నాయి.

గండికోట అభివృద్ధిపై మీఆలోచనలేమిటి?

గండికోట ప్రసిద్ధ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. రూ.77.9 కోట్ల వ్యయంతో లోయ శృంగాలను, లోయ ప్రాంతాలను హెరిటేజ్ ట్రైల్స్, న్యాచురల్ ట్రైల్స్, హెలీటూరిజం, బోటింగ్, సీప్లేన్, ఆధునిక హంగులు కలిగిన హెూటళ్ల ఏర్పాటు వంటి సదుపాయాలతో గండికోటను ప్రాచుర్యంలోకి తీసుకొస్తాం.

బోటింగ్ సదుపాయం గురించి చెప్పండి?

త్వరలోనే గండికోట పర్యాటక ప్రాంతంలోని బోటింగ్ సదుపాయాన్ని కల్పిస్తాం. దీంతోపాటు జిల్లాలోని ఒంటిమిట్ట చెరువు, వెలిగల్లు చెరువు, బ్రహ్మం సాగర్, సోమశిల వెనుక జలాల్లో బోటింగ్ సదుపాయాన్ని కల్పించడానికి అవకాశాలు ఉన్నాయని గుర్తించాం.

గుర్తింపునకు నోచని పర్యాటక ప్రాంతాలను వెల్లడించండి?

జిల్లాలో సిద్ధవటం, పెండ్లిమర్రి మండల ప్రాదేశిక ప్రాంతాల్లోని పదుల సంఖ్యలో దేవాలయాలు ఉన్నాయి. సిద్ధవటం మండలంలోని ఇసుక దిబ్బల్లోనే పలు ఆలయాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటిన్నింటినీ వెలుగులోకి తీసుకురావాల్సి ఉంది.

గండికోటలో ఒబెరాయ్ హోటళ్ల పురోగతిని తెలపండి?

గండికోట పర్యాటక ప్రదేశంలో సుమారు 57 ఎకరాల్లో రూ.1200 కోట్లతో ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణ ప్రతిపాదనల దశలోనే ఉంది. రెండేళ్ల వుతున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణ పనులు చేపట్టడానికి తన వంతు కృషి చేస్తాం. దీంతో జిల్లాలో పర్యాటకాభివృద్ధి మరింత ఊపందుకునే అవకాశం ఉంది.

గండికోట పర్యాటకుల వివరాలు చెప్పండి?

వీకెండ్ సమయాల్లో సుమారు ఐదు వేలకుపైగా పర్యాటకులు సందడి చేస్తున్నారు. మిగిలిన రోజుల్లో పర్యాటకుల సంఖ్య సాధారణంగానే ఉంటోంది. పర్యాటకుల సంఖ్యకు అవసరమైన మౌళిక వసతులను కల్పిచడం జరుగుతోంది.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

కడప : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో వాడవాడల ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో : 76వ భారత గణతంత్ర వేడుకలు పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. అనంతరం ఎస్‌పి అశోక్‌కుమార్‌తో కలిసి మైదానంలో పెరేడ్‌ను కలెక్టర్ పరిశీలించారు.వివిధ ప్లాటూన్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. కార్యక్రమంలో జెసి అదితి సింగ్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ: నగరపాలక సంస్థలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా కమిషనర్ మనోజ్‌రెడ్డి జాతీయజెండాకు వందనం చేశారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ముంతాజ్ బేగం, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమెన్స్ కళాశాలలో : కోటిరెడ్డి ఉమెన్స్ కళాశాలలో జెండాను ప్రిన్సిపల్ సలీం బాష ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల్ విద్యాపీఠ్ : గురుకుల్ విద్యాపీఠ్ స్కూల్‌లో ఎవిఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వెంకటేశ్వర్లు జెండాను ఆవిష్కరించారు. డైరెక్టర్ ఎ.వీరాకుమారి, సిఇఒ ఎ.ఎల్.వివేకానంద, ప్రిన్సిపల్ ఎన్.మునిచంద్ర, పాఠశాల వైఎస్ ప్రిన్సిపల్ నరసింహులు, ఇన్‌ఛార్జి ఆర్.బాబా ఫకృద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఆర్‌టిసి : ఆర్‌టిసి రీజనల్ కార్యాలయంలో ఇడి

కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం కళాశాలలో..

చంద్రశేఖర్ జెండా వందన చేశారు. అభివృద్ధికి కృషి చేసిన 60 మంది ఉద్యోగులను సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ, 36 సంవత్సరాలుగా ప్రమాదాలు చేయకుండా విధులు నిర్వహించిన ప్రొద్దుటూరు డిపో డ్రైవర్ వి.ప్రసాద్‌కు కలెక్టర్ శ్రీధర్ చేతులు మీదుగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

మదరస ఏ ఖూబాలో : నగరంలోని మదరస ఏ ఖూబా నిర్వహకులు ఖలీల్, దర్బారీ, ఖాసీం ఆహ్వానం మేరకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యులు సయ్యద్ దావూద్ బాష, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, 30వ డివిజన్ ఇన్‌ఛార్జి జియా ఉద్దీన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పెన్షనర్ల భవన్‌లో : పెన్షనర్ల సంఘం అధ్యక్షులు చెన్నారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామమూర్తి నాయుడు, పి.శ్రీనివాసులు, ఎ.సుబ్బరాయుడు, టి.నారాయణ, రాధాకృష్ణ, నగేష్, హనుమంతరావు, నాగమునిరెడ్డి, నాగయ్య, మల్లయ్య, పెన్షనర్లు పాల్గొన్నారు.

సి.పి.బ్రౌన్‌లో : సి.పి.బ్రౌన్ భాష పరిశోధన కేంద్రంలో జాతీయ జెండాను వైవీయూ విసి కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్రం సంచాలకులు జి.పార్వతి, తెలుగశాఖ అధ్యాపకులు పి.రమాదేవి, నాగరాజు, డాక్టర్ భూతపురి గోపాల కృష్ణశాస్త్రి, డాక్టర్ శివారెడ్డి, రమేష్‌రావు, హరిభూషణరావు, ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం : మాజీ సైనికులను వైవీయూ ఇన్‌ఛార్జి విసి కె.కృష్ణారెడ్డి సన్మానించారు. జిల్లా సైనిక సంఘం రూపొందిన క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పి.లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి బి.వి.గోపాల్‌రెడ్డి, కెప్టెన్లు జానకీరామ్, ఎస్.ఎస్.రాముడు, హవల్దార్ నాగన్న, నాయభ సుబేధార, ఆర్.నాగరాజు, వైవీయూ రిజిస్ట్రార్ పద్మా, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, ప్రొఫెసర్లు, అసిసెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఇస్లామిక్ స్కూల్‌లో : దారుస్ సలాం ఇస్లామిక్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఖున్ కా రిష్టా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గణంత్ర దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిస్సార్ అహమ్మద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రిజ్వాన్, వైస్ ప్రిన్సిపల్ సమీ, సిద్దీక్, ఖూన్ కా రిష్టా చైర్మన్ ఎం.తారిఖ్ అలీ, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది జయచంద్ర రెడ్డి, నరేష్, హరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపవరం : బద్వేల్ పురపాలక కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ నరసింహారెడ్డి జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా బద్వేల్ శాసన సభ్యురాలు డాక్టర్ సుధా,మునిసిపల్ చైర్మన్ వి.రాజగోపాల్ రెడ్డి హాజరై జెండా వందనం చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు ఆర్.వి.సాయికృష్ణ, వై .గోపాల్ స్వామి ,వార్డ్ కౌన్సిలర్లు, అధికారులు, ఎన్‌సిసి విద్యార్థులు, ప్రజలు హాజరయ్యారు.

కమలాపురం టౌన్ : వైఎస్ఆర్ జిల్లా కమలాపురం నగర పంచాయతీలోని 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి పార్టీ కార్యాలయంలో జండా ఆవిష్కరించి జెండా వందనం చేశారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ముస్లిములు ఖాజీలు పిలుపు మేరకు ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి, సీఐ రోషన్ ఈరోజు కుమ్మరి వీధిలోని తాళిమే అరెబిక్ మదరసా నందు మువ్వేన్నల జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాధ్ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు కార్యక్రమంలో ఎమ్మెటల్యేతో పాటు, మండల కన్వీనర్ రాఘవరెడ్డి కడప జిల్లా ముస్లిం మైనారిటీ నాయకుడు ఖాదర్‌బాషా దివాకర్ రెడ్డి జంపాల నరసింహారెడ్డి, చాపాటి ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలో 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా అధికారులు, విద్యార్థులు ప్రజలు జరుపుకున్నారు ఈ సందర్భంగా ఒంటిమిట్ట రెవెన్యూ కార్యాలయం, ఎంపిడిఒ, పంచాయతీ కార్యాలయం, పాఠశాలల్లో మువ్వన్నెల జెండాను ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలపించి ఘనంగా వేడుకలు నిర్వహించారు.

కాశినాయన : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర వేడుకల సందర్భంగా జండా

కడప అర్బన్ : సాయిబాబా స్కూల్లో..

ఆవిష్కరణ చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బందితో జెండా ఆవిష్కరించారు. నరసాపురంలోని అంగన్వాడి వన్ సెంటర్ నందు అంగన్వాడీ టీచర్ రమాదేవి చిన్నపిల్లలతో జెండా ఆవిష్కరణ చేసి ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మైథిలి, ఎంఆర్‌సి భవనంలో ఎంఇఒ నిర్మల, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో నిర్వహించారు.

చెన్నూరు : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, కడప కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి చెన్నూరులో నివాసముంటున్న స్వాతంత్ర్య సమరయోధుడు ఎడబల్లె బాల యల్లారెడ్డిని కలిసి సన్మానించారు. ఆయన యోగక్షేమాలను తెలుసుకున్నారు. బాల ఎల్లారెడ్డికి ప్రస్తుతం వంద ఏళ్లు. ఆయన స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాల గురించి అడిగి తెలుసుకున్నారు.

పులివెందుల టౌన్ : స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వంతోపాటు అందరికీ న్యాయం అందాలనే మన భారత రాజ్యాంగ స్ఫూర్తి ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో ఆయన జెండా ఆవిష్కరించారు. డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి మురళీ నాయక్, ప్రభుత్వ కార్యాలయంలో సంబంధిత అధికారులు, పార్టీ కార్యాలయాల్లో నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు.

సింహాద్రిపురం : సింహాద్రిపురం శ్రీ వివేకానంద హైస్కూల్‌లో ఎంఇఒ-1 ఎం.ఓబులేసు ముఖ్యఅతిథిగా పతాకావిష్కరణ చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.ఖాదరవలి, డైరెక్టర్ కెఎం జాఫర్ సాహెబ్, ప్రధానోపాధ్యాయులు ఎస్.షేహనాజ్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హిమకుంట్ల జడ్‌పి హైస్కూల్‌లో మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవిచం

కడప : వికాస్ హైస్కూల్లో..

ద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ తులసి నాగప్రసాద్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అరుణ, పశువైద్యశాలలో ఎడి శివప్రసాద్ జెండా ఆవిష్కరించారు.

ముద్దనూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అటవీశాఖ, పోలీస్‌స్టేషన్, ఎక్సైజ్ స్టేషన్లో ఆయా శాఖల అధికారులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి, సిఐ దస్తగిరి, ఎంపిడిఒ ముకుందారెడ్డి, ఎఫ్ఆర్ఒ అశోక్‌కుమార్ యాదవ్, ఎంఇఒ నాగేశ్వర నాయక్ జెండా వందనం చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎంపిటిసి లక్ష్మి కాంతమ్మ, తహశీల్దార్ ఆధ్వర్యంలో విధుల పట్ల అంకిత భావంతో ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, బిఎల్‌ఒలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా ఎఒ వెంకట కృష్ణారెడ్డి ఉత్తమ వ్యవసాయ అధికారిగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు.

చాపాడు : జాతీయ నాయకుల స్ఫూర్తితో రాజ్యాంగ ఫలాలను ప్రతి ఒక్కరికి అందివ్వాలని తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను తమ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ రమాకుమారి శాంతికి, బానిస సంకెళ్లకు విముక్తికి చిహ్నంగా తెల్లపావురాన్ని ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మమయ్య, ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి, ఎంఇఒ రవిశంకర్, ఉపాధి ఎపిఒ జగదీశ్వర్ రెడ్డి, డిటి కృష్ణారెడ్డి, ఆర్ఐ శివశంకర్ రెడ్డి, విఆర్‌ఒలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జెండా వందనం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి శివ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

చక్రాయపేట : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ బివి కృష్ణయ్య, తహసిల్దార్ కార్యాలయంలో పి.విజయకుమారి, ఎంపిడిఒ కార్యాలయం వద్ద బి.రాజశేఖర్ రెడ్డి, జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపల్ షేక్ రంతు బాషా, విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఇఒ-2 టి.వెంకట రవికుమార్ జెండా ఎగురవవేశారు.

ఖాజీపేట : గణతంత్ర దినోత్సవ వేడుకను ఆదివారం ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థల యజమానులు ఘనంగా జరుపుకున్నారు. కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు ఆలపించారు. నృత్యాలు చేశారు. ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో.. స్థానిక పిడబ్ల్యూడి బంగ్లా సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫయాజ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పులివెందుల రూరల్ : స్థానిక భాకరాపురం వైసిపి క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భారత రాజ్యాంగం, స్వతంత్ర ఉద్యమ నాయకుల గురించి కొనియాడారు. తదనంతరం కార్యకర్తలకు నాయకులకు శుభాకాంక్షలు తెలియజేసి, స్వీట్లు పంపిణీ పంచుకున్నారు.

వేముల : ఎంపిడిఒ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను జడ్‌పిటిసి కొకటం వెంకట బయపురెడ్డి, ఎంపిపి చల్లా గంగాదేవి వెంకట నారాయణ, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి రామచంద్రారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మండి మా పీరా పాల్గొన్నారు.

కొండాపురం : అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ వద్ద సిఐ మహమ్మద్ రఫీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేసిన రోజున గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని సిఐ తెలిపారు. రెవెన్యూ, ఎంపిడిఒ కార్యాలయాల్లో, శ్రీ స్వామి వివేకానంద హైస్కూల్, శివసాయి హైస్కూల్, కొండాపురం, చౌటిపల్లి, తాళ్ల ప్రొద్దుటూరు జడ్‌పి హైస్కూళ్లల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

కడప : కోర్టు ఆవరణలో..

కడప అర్బన్ : గురుకుల్ విద్యా పీఠ్‌లో..

కడప అర్బన్ : హెలెన్ కెల్లర్ పాఠశాలలో..

కడప అర్బన్ : పీస్ స్కూల్లో..

ఖాజీపేట : బీరం పాఠశాలలో..

కడప అర్బన్ : ఆర్‌టిసి ఇడి కార్యాలయంలో..

కడప : వైసిపి కార్యాలయంలో..

కడప అర్బన్ : మాట్లాడుతున్న సలా ఉద్దీన్

పులివెందుల టౌన్ : శిల్పారామంలో..

చక్రాయపేట : పోలీస్‌స్టేషన్‌లో..

చాపాడు : పావురాన్ని ఎగురవేస్తున్న తహశీల్దార్ రమాకుమారి

నాయకుల స్ఫూర్తిని కొనసాగించాలి

- విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

నాయకుల స్ఫూర్తిని కొనసాగించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మైదుకూరు రాయల్ కూడలిలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం నూరు అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో పలుచోట్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్, అమరజీవి పొట్టి శ్రీరాములు, యోగివేమన కాంస్య విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీని వాసులరెడ్డి, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, టిడిపి నాయకులు ధనపాల జగన్, దాసరి బాబు, ఎపి రవీంద్ర, యాపరాల చిన్న, ఆర్యవైశ్య సభ అధ్యక్షులు సూరిశెట్టి ప్రసాద్ గుప్తా, ఆర్యవైశ్య ప్రముఖులు, మాల మహానాడు నాయకులు వెంకటసుబ్బయ్య, వసంత్‌కుమార్, నాయకులు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

గణతంత్ర దినోత్సవం రోజున ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకుంటూ జాతీయ జెండాను ఎగురవేస్తారు. ఖాజీపేటలో మాత్రం మాంసం దుకాణాలు యథేచ్ఛగా కొనసాగాయి. దుకాణదారులు తెల్లవారకముందే పోటీలతో తమ వ్యాపారాలను కొనసాగించారు. గణతంత్ర దినోత్సవం రోజున మద్యం, మాంసం విక్రయాలు నిషేధమని ప్రభుత్వం, అధికారులు చెప్పుకొచ్చినా క్షేత్రస్థాయిలో మాత్రం సాధ్యపడలేదు. గణతంత్ర దినోత్సవ రోజున మాంసం దుకాణాలు తెరిచి ఉంచిన దృశ్యాలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. ఇలాంటి చర్యల పట్ల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని దేశభక్తి పౌరులు, ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తారన్న ధోరణితోనే భయభక్తులు లేకుండా దుకాణాలు తెరిచి అమ్మకాలు సాగించారని, భారత రాజ్యాంగన్ని అగౌరవపరిచేలా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా : ఎంఇఒ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని మండల విద్యాధికారి-2 ప్రభుదాస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఇఒ-2గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఎంఇఒ-1 ఓబులేసు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఇఒ-2 శారద సెలవుపై వెళ్లడంతో బలపనూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రభుదాస్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అరవింద్, ఆపరేటర్ నాగసుందరం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ప్రజాశక్తి - చాపాడు

రైతులు సకాలంలో పంట రుణాలను చెల్లించాలని అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి బిసి సుగుణ కోరారు. స్థానిక బ్యాంక్ ఆవరణలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు ప్రస్తుతం పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్పు చెందిందన్నారు. 2,447 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ద్వారా రూ.13 కోట్లు రుణాలు అందించామన్నారు. సకాలంలో వడ్డీ చెల్లిస్తే 7 శాతం వడ్డీ తిరిగి రైతుల ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో సిఇఒ జాన్, సిబ్బంది రంగా పాల్గొన్నారు.

భారతదేశంలో ముస్లింల పాత్ర విడదీయరానిది

ప్రజాశక్తి - ఖాజీపేట

భారతదేశంలో ముస్లింల పాత్ర విడదీయరానిదని ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. స్థానిక బస్టాండు కూడలిలో ఆదివారం ఖాజీపేటకు చెందిన చరిత్రకారుడు ఇంతియాజ్ మహమ్మద్, పుస్తక ప్రేమికుడు షేక్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామంలో ముస్లింలు వీరోచితమైన దేశభక్తిని ప్రదర్శించారని కొనియాడారు. సామాజిక , చారిత్రక, రాజకీయ అంశాల్లో ముస్లిం పాత్ర విడదీయరానిదన్నారు. నేటితరం వివక్షతలకు, సామాజిక హెచ్చుతగ్గులను పక్కన పెట్టి అందరూ చరిత్రను చదవాలని, ప్రతి ఒక్కరూ దేశపు నిర్మాణంలోనూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు ఉద్యమ నాయకుడు ఎరికల రెడ్డి, పుస్తక పాఠకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు రక్తహీనత పరీక్షలు

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో వృద్ధులకు రక్త గ్రూపు నిర్ధారణ, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మి వినాయక క్లినికల్ ల్యాబ్ టెక్నీషియన్ రాఘవరెడ్డి, మథర్ థెరిస్సా క్లినికల్ ల్యాబ్ టెక్నీషియన్ రఫీ పాల్గొన్నారు.

నాక్ బి డబల్ ప్లస్ గుర్తింపు గర్వకారణం

- ఎస్‌విడిసి కరస్పాండెంట్ అర్కటవేముల హరి నారాయణ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : నాక్ బి డబల్ ప్లస్ గుర్తింపు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు రావడం గర్వకారణమని కరస్పాండెంట్ అర్కటవేముల హరి నారాయణ తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ బృందం ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుకు తగ్గట్లు విద్యార్థులందరూ భవిష్యత్తులో మంచి లక్ష్యాలను ఎంచుకొని చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల కో-ఆర్డినేటర్ గౌరీ శంకర్, ప్రిన్సిపల్ ముస్తఫా, నరసింహ, నరేష్, పృథ్వీ నారాయణ, సలీం, ఎన్‌సిసి ఇన్‌స్ట్రక్టర్ దావీదు, సలీం, మునయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు వీల్‌ఛైర్స్, కర్రలు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవా సమితి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో విభిన్నప్రతిభావంతులకు వీల్ ఛైర్స్, కర్రలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్‌కు అభినంధనలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, ఆసిఫ్, రుక్మిణమ్మ, హనుమంతు, పి.కబంగిరి రాముడు, మహబూబ్, రహమతుల్లా పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం

ముద్దనూరు : ఎల్ఎమ్ కాంపౌండ్ యువకులు ప్రవీణ్, పవన్, ప్రసాద్, జానీ, ప్రశాంత్, నిఖిల్, టోని, అభి, బన్నీ, స్టాన్లీ ఆదివారం కోడిగాండ్లపల్లె వద్ద ఉన్న ఏసు కరుణాలయం అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. వాక్యోపదేశకులు రమేష్, ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు ఇమ్మాని యెల్, యువకులు సుందర్, ప్రఫుల్, తేలు విజయ్, సన్నీ, విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం విధాన ప్రకటన చేయాలి

చాపాడు : గ్రామీణ బ్యాంకుల విలీనం తర్వాత కూడా ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి తరలించకుండా ఆపే విషయాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి గత వారం మైదుకూరులో ప్రకటించడం పట్ల సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చేత ఒక విధాన పరమైన ప్రకటన ప్రభుత్వం చేయించాలని కోరారు. కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకుడు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

జీపు జాతాను విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు : కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడంలో11 ఏళ్లుగా మీనమేషాలు లెక్కిస్తున్న బిజెపి వైఖరికి నిరసనగా సిపిఎం చేపట్టిన జీపు జాతాను విజయవంతం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదంతో రాష్ట్ర వ్యాపితంగా సిపిఎం జీపు జాతా నిర్వహిస్తోందన్నారు. ప్రొద్దుటూరుకు ఈనెల 30న చేరుకుంటుందన్నారు. పార్టీ పట్టణ కమిటీ సభ్యులు బాబు, ఓబయ్య, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాధ్, చిన్న పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

- వైసిపి బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని వైసిపి బిసి సెల్ జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తనను జిల్లా కమిటీ బిసి సెల్ నియోజవర్గ అధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షులు రవీంద్రా రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డికి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల వారందరికీ వైసిపి తరపున అండగా ఉండి వారి సమస్యలపై పోరాడుతాడని తెలిపారు. రాష్ట్ర, జిల్లా కమిటీ సూచనల మేరకు నడుచుకొని పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులతో కలిసి కృషి చేస్తానన్నారు.

వైఎస్ జగన్‌తో ప్రవీణ్ యాదవ్ (ఫైల్‌ఫొటో)

శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము ప్రొద్దుటూరు, వై.యస్.ఆర్ కడప జిల్లా.

ప్రకటన

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా పై దేవస్థానము నందు తేదీ:26.02.2025 న మహా శివ రాత్రి సందర్భమున 1). లైటింగ్, డెకరేషన్ 800 - సీరియల్ లైట్స్, 20 - రన్నింగ్ లైట్స్, 20-డే లైట్స్, 20- లైటింగ్ బోయర్డ్స్, మైక్ సెట్ సౌండ్ సిస్టమ్ (పెద్దవి) ఏర్పాటు, మరియు 2). పైపుల పందిర్లు 10×20 లో 8, 20×20 లో 10 మరియు 20-క్యూ లైన్ కొరకు Iron బ్యారీ గేట్స్ ఏర్పాటు చేయుటకు, పూల అలంకారముల కొరకు 4-గజ మాలలు, 3-తో మాలలు, 10-రోజా దండలు, 50-మూర పూలు, 5-Kg - వీడి పూలు. ఆసక్తి గల వారు 7 దినముల లోపల దేవస్థానము కార్యాలయము నందు కొటేషనులు అందజేయవలసినదిగా కోరుచున్నాము. ఇతర వివరములకు ఆఫీస్ నందు సంప్రదించగలరు.

K. రామచంద్రాచార్యులు, M.A., B.Ed
కార్యనిర్వహణాధికారి,
శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం
దేవదాయశాఖ ప్రొద్దుటూరు టౌన్
వైయస్సార్ కడప జిల్లా.